క్లుప్తంగా

వరద బాధితులకు ఏయూ టీచర్స్ సొసైటీ విరాళం



ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావుకు చెక్కు అందిస్తున్న సొసైటీ ప్రతినిధులు

విశాఖ సిటీ: విజయవాడ **వరద బాధితుల** సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి ఆంధ్ర విశ్వవిద్యాలయం టీచర్స్ మ్యూచువల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ప్రతినిధులు రూ.1.04 లక్షలు విరాళం అందజేశారు. సంబంధిత చెక్కును శుక్రవారం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుకు అందించారు. ఈ విరాళాన్ని సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ఆచార్య ఎస్.ఆదిశేషు, ఆచార్య ఎన్.చిట్టిబాబు, ఆచార్య ఆర్.మధుసూదన్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

స్టూడెంట్ అంబాసిడర్‌గా వెంకటసాయి తేజేష్



తేజేష్‌కు ఉత్తర్వులు అందిస్తున్న రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ సిటీ: స్టూడెంట్ అంబాసిడర్ టు క్లబ్స్ అండ్ కాలేజ్(ఎస్ఏసీసీ)గా ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విద్యార్థి దాసరి వెంకటసాయి తేజేష్ నియమితుడయ్యారు. ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు ఆదేశాలతో విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య జి.రాంబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు తన కార్యాలయంలో శుక్రవారం సాయి తేజేష్‌కు ఉత్తర్వులు అందజేసి అభినందించారు. విద్యార్థులకు ఉపయుక్తంగా నిలిచే క్లబ్‌లను బలోపేతం చేసి, సమన్వయ పరిచి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా తేజేష్‌ను పలువురు విద్యార్థులు అభినందించారు.

బీసీల సమస్యలపై వినతి

బీచ్‌రోడ్డు: బీసీ సామాజిక వర్గీయుల సమస్యలను పరిష్కరించి, న్యాయం చేయాలని రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను అఖిల భారత బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లగుడు గోవిందరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం నగరంలో మంత్రిని కలిసి బీసీల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని, జనగణనతో పాటు బీసీ కులగణన కూడా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని, బీసీలకు నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యం కల్పించాలన్నారు. బీసీలకు నూరు శాతం సబ్సిడీతో రుణాలు కల్పించాలని, ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన బీసీ సామాజిక వర్గ వ్యక్తిని పూర్తిస్థాయిగా వీసీగా నియమించాలని కోరారు. తాటిపూడి జలాశయానికి బీసీ ఉద్యమ నేత గొర్రెపాటి బుచ్చి అప్పారావు పేరును యథావిధంగా కొనసాగించాలన్నారు. బీసీ నాయకులు పెదిరెడ్ల సత్యం, వరుదు రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దయాల్‌బాగ్ ఉత్పత్తుల ప్రదర్శన



వివరాలు వెల్లడిస్తున్న ప్రేమ్ స్వరూప్

ఆరిలోవ: దయాల్‌బాగ్ వస్తు ప్రదర్శన ఈ నెల 19 నుంచి 20 వరకు నిర్వహిస్తున్నట్లు డీఈఐ ఎపెక్ హెడ్ వి.ప్రేమ్ స్వరూప్ తెలిపారు. విశాలాక్షినగర్ డీఐసీ కేంద్రంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. డీఈఐ(దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్) సౌత్‌జోన్ ఆధ్వర్యంలో ఉషోదయ కూడలి వద్ద గల ఉషోదయ ఫంక్షన్ హాలులో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. డీఈఐలో చేతి వృత్తుల్లో శిక్షణ పొందిన 52 మంది తయారు చేసిన ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రదర్శన ఉంటుందని, సుమారు రూ.12 లక్షలు విలువ చేసే ఉత్పత్తులను విక్రయానికి సిద్ధం చేసినట్లు వివరించారు. బ్లాక్ ప్రింటెడ్ చీరలు, దుప్పట్లు, బెడ్‌షీట్లు, దివాన్ సెట్లు, పిల్లో కవర్లు, జ్యూట్, కాటన్‌తో తయారు చేసిన బ్యాగులు, కుర్తాలు, పిల్లల దుస్తులు, తదితరవి ఇక్కడ అందుబాటులో ఉంటాయని, నగర వాసులు వినియోగించుకోవాలని కోరారు. విశాఖ డీఐఈ సెంటర్ ఇన్‌చార్జి దక్షణమూర్తి, సభ్యులు పాల్గొన్నారు.





పెదవాల్తేరులోని ప్రభుత్వ మానసిక ఆస్పత్రి వెనుక వైపు రహదారులపై పారబోసిన మెడికల్ వ్యర్థాలు

వ్యర్థం.. అనర్థం..!

- బహిరంగ ప్రదేశంలో మెడికల్ వేస్ట్ పారబోత
- మానసిక ఆస్పత్రి వద్ద ఇదీ పరిస్థితి
- అధికారుల పర్యవేక్షణ లోపం.. సిబ్బంది నిర్లక్ష్యం

బీచ్‌రోడ్డు: ఆస్పత్రుల మెడికల్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పారవేయడం చాలా ప్రమాదకరం. వాటి వల్ల అనేక రోగులు వచ్చే అవకాశముంటుంది. అందుకే వాటిని చాలా జాగ్రత్తగా ప్యాక్ చేసి జనావాసాలకు దూరంగా ఉండే ప్రాంతాలకు తరలిస్తారు. అయితే నగరం నడిబొడ్డున గల పెదవాల్తేరు ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలోని మెడికల్ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పారబోస్తున్నారు. అక్కడ చెత్త సేకరణ కోసం ప్రత్యేకంగా డస్ట్ బిన్లు ఉన్నప్పటికీ ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యంగా రోడ్లపైనే



ఆస్పత్రి వద్ద నిరుపయోగంగా ఉన్న డస్ట్ బిన్లు

మెడికల్ వేస్ట్‌ను వేసేస్తున్నారు. దీంతో ఆస్పత్రి చుట్టుపక్కల నివసిస్తున్న ప్రజలు రోగాల బారిన పడే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మెడికల్ వ్యర్థాలను బహిరంగంగా పారబోయడం ప్రమాదకరమని తెలిసినా.. మానసిక ఆస్పత్రి ఉన్నతాధికారులు తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు స్థానికులు ఆరోపిస్తున్నారు.

రోడ్డు మీదే డంపింగ్

రోగుల కోసం వినియోగించి ఇంజక్షన్లు, మందులు, డ్రెస్సింగ్ కోసం వినియోగించి క్లాత్‌లు.. ఇలా అన్ని రకాల మెడికల్ వేస్ట్‌ను మానసిక ఆస్పత్రి వెనుక వైపు ఉన్న రోడ్డుపై బహిరంగంగా వేస్తున్నారు. అసలే వర్షా కాలం కావడంతో మెడికల్ వ్యర్థాలు వేసిన ప్రదేశంలోనే కాకుండా ఆ చుట్టు పక్కల ప్రాంతమంతా విస్తరించే అవకాశం ఉంటుంది. దీంతో ఆస్పత్రి వెనుక వైపు ప్రాంతంలో నివసిస్తున్న వారికి దుర్వాసన రావడంతోపాటు అనేక రోగాలు వచ్చే ప్రమాదముంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం.. దిగువ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే రోడ్డుపై మెడికల్ వేస్ట్‌ను పారబోస్తున్నారు.

నిరుపయోగంగా డస్ట్ బిన్లు

మెడికల్ వ్యర్థాలను వేయడం కోసం మానసిక ఆస్పత్రి వద్ద రెండు డస్ట్ బిన్లు ఏర్పాటు చేశారు. సిబ్బంది వాటిని వినియోగించకుండా వ్యర్థాలను రోడ్డుపై వేస్తున్నారు. దీంతో చెత్త సేకరణ బాక్సులు నిరుపయోగంగా ఆస్పత్రి ఆవరణలో పడి ఉంటున్నాయి. ఉన్నతాధికారులు దృష్టి సారించి మెడికల్ వేస్ట్‌ను జాగ్రత్తగా సేకరించి దూర ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కాలువల శుభ్రతకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



9వ వార్డు కాలువలో పూడిక తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డులో పూడుకుపోయిన కాలువలను పారిశుధ్య విభాగం అధికారులు శుభ్రం చేసే చర్యలు చేపట్టారు. రెండు రోజులుగా కాలువల్లో పేరుకుపోయిన పూడిక తొలగించడం, కాలువల్లో దట్టంగా మొలిచిన పిచ్చి మొక్కలను తొలగించడం చేస్తున్నారు. వార్డులోని **వెటర్నరీ కాలనీ, కో** ఆపరేటివ్ రోడ్డు, రెవెన్యూ **కాలనీ తదితర ప్రాంతా**ల్లో కాలువలు పూడికతో **మూసుకుపోయాయి.** మరికొన్ని చోట్ల దట్టమైన **పిచ్చి మొక్కలతో కాలు**వలు నిండిపోయాయి. ఈ **సమస్యపై ఈ నెల 15**న 'కాలువలు అస్తవ్యస్తం' **అనే శీర్షికన 'సాక్షి'లో** ప్రచురితమైన కథనానికి జీవీ**ఎంసీ జోన్-2 అధికా**రులు స్పందించారు. వార్డు **శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప**ర్యవేక్షణలో సిబ్బంది ఆయా **ప్రాంతాల్లో కాలువలు** శుభ్రం చేస్తున్నారు. ఏళ్లుగా **కాలువలు పూడికతో** నిండిపోవడంతో వీటిని శుభ్రం చేయడానికి మరికొన్ని రోజులు పడుతుందని సిబ్బంది అంటున్నారు. కాలువల నుంచి పూడికతోపాటు ఖాళీ బీరు బాటిళ్లు, పాలిథిన్ కవర్లు అధికంగా బయటపడుతున్నాయి.

కృష్ణా కాలేజీని సందర్శించిన నాక్ బృందం



నాక్ బృంద సభ్యులకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కృష్ణా కళాశాల పూర్వ విద్యార్థులు

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలను శుక్రవారం నాక్ కమిటీ సందర్శించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు సమక్షంలో పూర్వ విద్యార్థుల అసోసియేషన్, తల్లిదండ్రుల అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. నాక్ బృంద సభ్యులతో పూర్వ విద్యార్థుల అసోసియేషన్(అలుమ్ని) అధ్యక్షుడు హేమంత్‌కుమార్ మాట్లాడుతూ కాలేజీ యాజమాన్యంతో కలిసి విద్యార్థుల శ్రేయస్సు కోసం పలు కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. మినరల్ వాటర్ ప్లాంట్ స్థాపించామని, బయట వారు కళాశాలలోకి ప్రవేశించకుండా అంతర్గత గేటు నిర్మించామని, మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించామని, పేద విద్యార్థులకు ఫీజులు, స్కాలర్‌షిప్‌లు అందించామని తెలిపారు. భవిష్యత్తులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం పెద్ద ఎత్తున నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో రాపేటి వెంకటరమణ, ప్రభ, వి.తేజేశ్వరరావు, సునీత, సుకార్సు సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పెదగదిలిలో అన్నసమారాధన



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు పెదగదిలిలో విజయదుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఉత్సవ నిర్వాహకులు అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని మేయర్ గొలగాని హరివెంకటకుమారి దర్శించుకుని, పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు ఆమె అన్నప్రసాదం వడ్డించారు. పెదగదిలి, చినగదిలి, సింహగిరి కాలనీ, సాలిపేట తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారి ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, ఉత్సవ నిర్వాహకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విశాఖ వ్యాలీ స్కూల్ ప్రిన్సిపాల్‌కు అవార్డు



న్యూఢిల్లీలో అవార్డు స్వీకరిస్తున్న ప్రిన్సిపాల్ ఈశ్వరీ ప్రభాకర్

ఆరిలోవ: విశాఖ వ్యాలీ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరీ ప్రభాకర్‌కు ప్రతిష్టాత్మకమైన ఎడ్యుకేషన్ వరల్డ్ ఇండియా స్కూల్ గ్రాండ్ జ్యూరీ అవార్డు 2024-25 వరించింది. న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆమె ఈ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడారు. డిజైన్ థింకింగ్ లీడర్‌గా ర్యాంక్ పొందినట్లు తెలిపారు. రోట్ లెర్నింగ్‌కు మించి ముందుకు సాగడం, విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆలోచన, సహకారం, సమస్య పరిష్కారం తదితర నైపుణ్యాలను పెంపొందించే బోధన విధానాన్ని అమలు చేయడంలో అసాధారణమైన సామర్థ్యాన్ని గుర్తించి ఈ అవార్డుకు తనను ఎంపిక చేసినట్లు వివరించారు. ఈ విభాగంలో దేశంలో టాప్ 10లో నిలిచినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన ర్యాంకింగ్‌లో విశాఖపట్నం జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో మొదటి స్థానంలో నిలవడంతో ఈ అవార్డు వరించిందన్నారు. కో-ఎడ్యుకేషన్ పాఠశాలల్లో విశాఖ వ్యాలీ స్కూల్ రాష్ట్రంలో టాప్-3లో నిలిచినట్లు వెల్లడించారు. ఈ అవార్డు రావడంపై సంతోషం వ్యక్తం చేశారు.

సినర్జీస్ కంపెనీ కార్మికులకు బకాయిలు చెల్లించాలి

మద్దిలపాలెం: సినర్జీస్ కంపెనీ కార్మికులకు బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దువ్వాడ వీఈపీజెడ్‌లోని సినర్జీస్ కంపెనీలో మూడు రోజుల నుంచి కార్మికులు బకాయి ఉన్న ఆరు నెలల జీతాలు చెల్లించాలని, న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఆందోళన చేస్తున్నారన్నారు. తక్షణమే కంపెనీ యాజమాన్యం బకాయిలను చెల్లించి, కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. కార్మికులకు అతి తక్కువ వేతనాలు చెల్లిస్తూ లాభాలు ఆర్జిస్తున్న సినర్జీస్ యాజమాన్యం నెలల తరబడి జీతాలు చెల్లించకపోతే కార్మికుల కుటుంబాలు ఏ విధంగా బతుకుతాయన్నారు. వీఈపీజెడ్‌లో కార్మిక చట్టాలు అమలు చేసేటట్లు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల పోరాటానికి సీఐటీయూ తన పూర్తి సంఘీభావాన్ని తెలుపుతోందన్నారు.

తగ్గని కెరటాల ఉధృతి



రాళ్లను తాకుతూ ప్రవహిస్తున్న కెరటాలు

ఏయూక్యాంపస్: వాయుగుండం ప్రభావం తగ్గినప్పటికీ విశాఖ సాగర తీరంలో కెరటాల ఉధృతి పూర్తిస్థాయిలో తగ్గలేదు. భారీ కెరటాలు ముందుకొస్తూ కొబ్బరి చెట్ల రక్షణ కోసం వేసిన రాళ్లు, ఫుట్‌పాత్ గోడను తాకుతున్నాయి. సముద్రం భారీగా ముందుకొచ్చింది. పలు చోట్ల ఇసుక కోతకు గురవుతోంది. కెరటాలు ఇంత తీవ్రంగా, ప్రమాదకరంగా వస్తున్నా పలుచోట్ల సందర్శకులు యథేచ్ఛగా సముద్ర స్నానాలు చేయడం కనిపించింది. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా.. పర్యాటకులు వీటిని విస్మరిస్తూ తీరంలో స్నానాలు చేస్తున్నారు.

సాగరతీరం.. చెత్తమయం



సుందర సాగరతీరం చెత్తాచెదారంతో నిండిపోయింది. లుంబినీ పార్క్ బీచ్ పరిసర ప్రాంతాల్లో దుర్గంధం వెదజల్లుతోంది. కొద్ది రోజులుగా పరిస్థితి ఇలాగే ఉన్నప్పటికీ.. జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. విశాఖ సాగరతీరాన్ని సుందరంగా తీర్చిదిద్దాల్సిన అధికారులు.. చెత్త పేరుకుపోయినా తొలగించకపోవడంపై స్థానికులు, సందర్శకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

'హిందీ భాషా సాహిత్యాలు'పై చర్చా గోష్టి



చర్చా గోష్టిలో పాల్గొన్న ఏయూ వీసీ శశిభూషణరావు, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం హిందీ విభాగం, విశాఖ హిందీ పరిషత్, అవధి సాహిత్య సంస్థాల సంయుక్త ఆధ్వర్యంలో 'హిందీ భాషా సాహిత్యాలు-ఒక విమర్శ'అనే అంశంపై శుక్రవారం హిందీ భవన్‌లో చర్చా గోష్టి జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఏయూ వీసీ శశిభూషణరావు ప్రారంభించి.. హిందీ భాష ప్రాశస్త్యాన్ని వివరించారు. హిందీని నేర్చుకోవాల్సిన ఆవశ్యకతను విశదీకరించారు. విశాఖ హిందీ పరిషత్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్.ఎం.ఇక్బాల్ సుల్తాన్పూర్ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో హిందీని అధ్యయనం చేసిన విద్యార్థులు, విద్వాంసులకు తగిన గుర్తింపు, ఉద్యోగాలు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హిందీ అధ్యాపకులను కేంద్ర ప్రభుత్వమే నియమించి, వారి జీతభత్యాలను చెల్లించే వ్యవస్థ రావాలని అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఆంధ్రా యూనివర్సిటీ ఆర్ట్స్, కామర్స్ కాలేజ్ ప్రిన్సిపాల్, హిందీ విభాగం అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎ.నరసింహారావు సభకు అధ్యక్షత వహించగా పూర్వ హిందీ విభాగ అధ్యక్షుడు పద్మభూషణ్ అవార్డు గ్రహీత యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, నార్వే నుంచి ప్రొఫెసర్ సతీష్‌చంద్ర శుక్ల, యూపీకి చెందిన డాక్టర్ హరినాథ్ శుక్ల, భోపాల్‌కు చెందిన డాక్టర్ ప్రయాస్ జోషి, ప్రొఫెసర్ మహేష్ దివాకర్, డాక్టర్ అర్జున్‌పాండే, ప్రొఫెసర్ జె.విజయభారతి, డాక్టర్ శితం తివారి తదితరులు పాల్గొన్నారు.

ఏఐ, ఎంఎల్‌తో మెరుగైన ఉపాధి అవకాశాలు

విశాఖ సిటీ: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ ద్వారా భారీ వేతనాలతో కూడిన ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు పేర్కొన్నారు. ఏఐసీటీ-వైబ్రెంట్ అడ్వకసి ఫర్ అడ్వాన్స్‌మెంట్ అండ్ నర్చరింగ్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్(వాణి) సహకారంతో ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏఐ, ఎంఎల్, డీఎస్‌పై తెలుగులో చర్చా వేదికను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2024 నాటికి వీటి అనువర్తనాలను 75 శాతానికి వినియోగిస్తారని తెలిపారు. ప్రజల్లో వీటి పట్ల విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. లక్షలాది నూతన ఉపాధి అవకాశాలను సృష్టించే శక్తి ఈ సాంకేతికతలకు ఉందని వివరించారు. దీనిని దృష్టిలో పెట్టుకొని దేశ, విదేశీ నిపుణులతో ఏయూ, అనుబంధ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులకు అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లలో ఏయూ కేంద్రీయ విద్యా సంస్థలైన ఐఐటీల కంటే మెరుగైన స్థానాన్ని సాధించిందన్నారు. సీఎస్ఈ విభాగం ఆచార్యుడు ఎం.శశి మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి నూతన సాంకేతికతలను బోధించాల్సిన అవసరం ఉందన్నారు. మాతృ భాషలో అందరికీ చేరువ చేసే విధంగా కృషి జరపాలన్నారు. దీనికి నాందిగా ఈ కార్యక్రమం నిలుస్తుందన్నారు. ఐటీ విభాగాధిపతి ఆచార్య కుంజం నాగేశ్వరరావు మాట్లాడుతూ సాంకేతికతను స్థానిక భాషతో అనుసంధానించడంతో మెరుగైన అవగాహన కలుగుతుందన్నారు. సీఎస్ఈ విభాగాధిపతి ఆచార్య కె.వెంకటరావు , సదస్సు సహ సమన్వయకర్త ఆచార్య ఎం.రాంజీ, ఏయూ ఇంకుబేషన్ సెంటర్ సీఈఓ రవి ఈశ్వరపు, విజయ్, సునీల్ ఎస్.రంక తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంయూ ఆధ్వర్యంలో 'చలో ఆర్ఎం కార్యాలయం'



ఆర్ఎం కార్యాలయానికి భారీ ర్యాలీగా వెళ్తున్న ఎన్ఎంయూ సభ్యులు, ఉద్యోగులు

ఎంవీపీకాలనీ: నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం చలో ఆర్ఎం కార్యాలయం కార్యక్రమాన్ని నిర్వహించారు. మద్దిలపాలెం డిపో నుంచి ద్వారకా ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని ఆర్ఎం కార్యాలయం వరకు ఉద్యోగులు ర్యాలీ చేశారు. జిల్లాలోని అపరిష్కృత సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకోకుండా ఏపీపీటీడీ అధికారులు అధికార దర్పంతో ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్న తీరుకు నిరసనగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పి.వి.వి.మోహన్ తెలిపారు. విశాఖ జిల్లా యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాలతో ఆర్టీసీ ఉద్యోగులను ఉద్యమంలోకి నెట్టే కుట్ర చేస్తోందని ఆరోపించారు. టీటీఐలు రాస్తున్న అక్రమ కేసులు, కక్ష సాధింపు చర్యలు, కార్మికులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను తొక్కిపెట్టడం వంటి అంశాలపై ఆయన తప్పుబట్టారు. ఆయా సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్ల ఉపాధికి భరోసా కల్పిద్దాం



ట్రాన్స్‌జెండర్లు, మహిళలతో పోలీస్ కమిషనర్ బాగ్చి, రోటరీ క్లబ్ ప్రతినిధులు

- సీపీ శంఖబ్రత బాగ్చి పిలుపు
- కోల్ ఇండియా సహకారంతో మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు కుట్టు మిషన్ల పంపిణీ

మద్దిలపాలెం: ట్రాన్స్‌జెండర్లకు స్వయం ఉపాధి కల్పించడంలో దేశంలోనే విశాఖ ఆదర్శనీయంగా నిలిచేలా కృషి చేద్దామని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పిలుపునిచ్చారు. కోల్ ఇండియా సీఎస్సార్ నిధులు రూ.2.50 కోట్లతో ఆధునిక కుట్టు మిషన్లను మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు అందించడం అభినందనీయమన్నారు. పిఠాపురంకాలనీలోని జన శిక్షణ సంస్థాన్‌లో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో సీపీ పాల్గొని.. 75 మందికి ఆధునిక కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ కుట్టు మిషన్లను ప్రతి మహిళా, ట్రాన్స్‌జెండర్లు సద్వినియోగం చేసుకుని.. ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. మహిళలు కుట్టిన వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని, ఇందుకు స్వచ్ఛంద సంస్థలు సహకరించాలన్నారు. విశాఖలో ట్రాన్స్‌జెండర్లకు సరైన ఉపాధి అవకాశాలు లేక ఇతర మార్గాల్లో పయనిస్తున్నారని.. దీని ద్వారా ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. నగరంలోని ట్రాన్స్‌జెండర్లను గుర్తించి.. వారందరూ ఒకే మార్గంలో నడిచేలా ఉపాధి కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ట్రాన్స్‌జెండర్లు కుట్టు శిక్షణ తీసుకోవడం అభినందనీయమని.. వీరిని మిగిలిన వారు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కుట్టు, క్లౌడ్ కిచెన్ రంగంలో శిక్షణ ఇవ్వడానికి తన వంతు కృషి చేస్తానని సీపీ అన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళలకు సమస్యలుంటే 79950 95799కు కాల్ చేయండి

మహిళలు వేధింపులకు గురైతే.. తన ఫోన్ నంబర్ 79950 95799కు ఫోన్ చేసి విషయం తెలియజేయాలని సీపీ శంఖబ్రత బాగ్చి సూచించారు. మహిళల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, వేధించిన తన దృష్టికి తీసుకురావాలన్నారు. నగరంలో ఉపాధి కోసం సుదూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే వారు, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగినిలు ధైర్యంగా విధులు నిర్వర్తించాలని భరోసా కల్పించారు.